హిందూ ధర్మంలో విద్వేషాలకు తావులేదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణమూర్తి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి విద్వేష భావాజాలమని, హిందూ ధర్మంలో విద్వేషాలకు తావులేదని హిందూస్ ఫర్ పూరలిటీ అండ్ ఈక్వాలిటీ (హెచ్‌పీఈ) జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి పేర్కొన్నారు. హెచ్‌పీఈ, అన్నమయ్య కళాక్షేత్రం సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ఎల్బీనగర్‌లోని జైభారత్ కార్యాలయంలో ద్వేషం, అసమానతలకు వ్యతిరేకంగా, శ్రీ రామకృష్ణ పరమహంస జయంతిని పురస్కరించుకుని 'వేద నాదం - శాంతి వాదం' పేరిట వేద సూక్తుల పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌పీఈ అధ్యక్షుడు సాధు త్రినాథదాస్, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు, పలు హిందూ సంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొని అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం పేరిట వీరరాఘవరెడ్డి, ఆయన అనుచరులు చేసిన దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఈ కార్యక్రమంలో సాయితత్వ ప్రచారకులు రజనీకుమార్, లోక్‌నాథ్, గీతావధాన కళానిధి డాక్టర్ యడ్లపల్లి మోహనరావు, భగవద్గీత ప్రవచనకారులు త్రినాథ్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి ఉమారాణి, దరూరి నరసింహాచార్యులు, నవనీత చోర మఠం వ్యవస్థాపకులు బాలకృష్ణమయానంద స్వామి, ఆర్యసమాజ్ ప్రతినిధి అరవింద శాస్త్రీ, వసుదాశర్మ, రఘుకుమార్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మోండి బకాయిదారుల ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం

27వేల మందికి డిమాండ్ నోటీసులు



మలక్‌పేట సర్కిల్ కార్యాలయం

ఓల్డ్‌మలక్‌పేట ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులను జప్తుచేసేందుకు మలక్‌పేట సర్కిల్-6 అధికారులు రంగం సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆస్తిపన్ను మొండిబకాయిదారుల ఆస్తులు జప్తుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో రెండేళ్ల పైబడి ఆస్తి పన్ను చెల్లించని సుమారు 27 వేల మందికి ఇప్పటికే డిమాండ్ నోటీసులు జారీచేశారు. మార్చి 31తో వార్షిక సంవత్సరం ముగుస్తుంది. గడువులోగా పెండింగ్ బకాయిలు వసూలు చేసేలా అధికారులు దృష్టిసారించారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో ఈ వార్షిక సంవత్సరం ఆస్తిపన్ను రూ.38 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.25 కోట్లు వసూలయ్యాయి. 65శాతం మంది ఆస్తిపన్ను చెల్లించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ ఉంటుందా?

ఆస్తిపన్ను బకాయిదారులను దృష్టిలో పెట్టుకొని జీహెచ్‌ఎంసీ ప్రతియేటా ఫిబ్రవరి, మార్చి నెలలో వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్) ప్రవేశపెడుతుంది. నెల రోజుల పాటు మొండి బకాయిలకు వడ్డీలేకుండా పన్నుచెల్లించే అవకాశం కల్పిస్తారు. అయితే, ఈసారి ఓటీఎస్ ఉంటుందా.. లేదా..? అనే విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు లేవని తెలుస్తోంది. చాలా మంది పెండింగ్ బకాయిలు ఓటీఎస్‌లో చెల్లించేదుకు ఎదురుచూస్తున్నారు.

ఆస్తులు జప్తుచేస్తాం



"మొండి బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు జారీచేశాం ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసేందుకు సిద్ధమవుతున్నాం. త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆస్తుల జప్తు చేస్తాం. ఓటీఎస్ విషయమై ఇంకా ఎలాంటి సమాచారమూ రాలేదు.

- జయంత్, ఉపకమిషనర్, మలక్‌పేట సర్కిల్, జీహెచ్‌ఎంసీ

మొక్కలు నాటి, చాక్లెట్లు పంచితే ఇన్‌చార్జి హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న పద్మానాయక్

చంపాపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటి, విద్యార్థులకు చాక్లెట్లు పంచి పెడితే ఇన్‌చార్జి హెచ్‌ఎం రజితను ఎలా సస్పెండ్ చేస్తారని బీఆర్‌ఎస్ నేత, హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అందోజు సత్యంచారి ప్రశ్నించారు. హస్తినాపురం డివిజన్ జడ్‌పీరోడ్ శ్రీరమణకాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ బర్త్‌డేను పురస్కరించుకొని స్థానిక లక్కీ హోటల్ ముందు కేక్‌కట్ చేసి, మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కేసీఆర్‌కు బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపి లాంగ్ లీవ్ కేసీఆర్ అని చెప్పడాన్ని కాంగ్రెస్ నేతలు తప్పుపట్టడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. స్థానిక కాంగ్రెస్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ పీఏ శ్రీనివాస్ పాఠశాల టీచర్లపై ఒత్తిడి తెచ్చి బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయంగా తమను ఏమీ చేయలేక ఇన్‌చార్జి హెచ్‌ఎంను సస్పెండ్ చేయించారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు నారగోని శ్రీనివాస్‌యాదవ్, రఘుమారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, ఇబ్రహీం, సయ్యద్, నరేష్, విష్ణు, బీష్మాచారి, చిరంజీవి, నిర్మల, బిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని కొలన్ శివారెడ్డి కాలనీలో రూ. 8.50 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెండింగు పనులన్నీ పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కొలన్ నరేందర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తాం: రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించే అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తామని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారి పక్కన ఓ నిర్మాణ సంస్థ చేపట్టిన ఆరెంజ్ బహుళ అంతస్తుల భవనం ముందు చేపట్టిన నిర్మాణాలను మంగళవారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ అనుమతించిన వరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, అందుకు విరుద్ధంగా చేపడితే ఊరుకునేదిలేదని ఆయన అన్నారు.

యువక్రాంతి శిక్షణ శిబిరం



యువక్రాంతి శిబిరం వద్ద వంశీచంద్‌రెడ్డి, పారిజాతారెడ్డి, తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలోని మన్సాన్‌పల్లి వద్ద మంగళవారం జరిగిన యువక్రాంతి పునాది శిక్షణ శిబిరానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఏఐసీసీ, టీపీసీసీ నేతలతో కలిసి పార్టీ నిర్మాణం, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడం వంటి అంశాలపై చర్చించారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, రాష్ట్ర మత్స్య సహకార సంస్థ చైర్మన్ సాయికుమార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సురభి ద్వివేది, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



శ్రీనికేతన్(ఫైల్)

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి 25రోజులుగా మృత్యువుతో పోరాడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కన్నుమూశాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన మక్కెన శ్రీనికేతన్(24) తాత కట్టా భాస్కర్‌రావు మృతి చెందడంతో జనవరి 24న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామానికి అమ్మమ్మ వద్దకు వెళ్లాడు. అదేరోజు సాయంత్రం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుతో కారులో పక్క గ్రామానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న మక్కెన శ్రీనికేతన్‌కు తీవ్ర గాయాలు కాగా, శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి అక్కడినుంచి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో చికిత్సపొందుతూ మంగళవారం శ్రీనికేతన్ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనికేతన్ కొన్నాళ్లు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేశాడు. సుమారు 25రోజుల పాటు మృత్యువుతో పోరాడి మృతి చెందాడు. మృతుడి బంధువు కట్టా గోపాల్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షోభంలో ఉన్న పాఠశాల విద్యను గాడిలో పెట్టాం : పొన్నం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హయత్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్న విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి, ప్రతి నెలా విద్యార్థులకు మెస్ చార్జీలను అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మునగనూర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల రెసిడెన్సియల్ పాఠశాలలో ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవతా విలువలు, నైపుణ్యాలు, తల్లిదండ్రుల గొప్పతనం, చదువులో ఎలా రాణించాలి అనే అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న భయాన్ని దూరం చేసి విశ్వాసాన్ని పెంచడానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయని అన్నారు. కష్టపడి చదువుకుని రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. తాను కూడా 37 సంవత్సరాల పాటు కష్టపడితేనే ఈ స్థాయికి చేరుకుని మంత్రిని అయ్యానని ఆయన వివరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలు జరిపి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సైదులు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాంమోహన్‌గౌడ్, ప్రిన్సిపల్ జానకీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబిత కనుసన్నల్లో అనుచరుల కబ్జాలు

బీజేపీ రాష్ట్ర నేత శ్రీరాములుయాదవ్



మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అనుచరులు పార్కు స్థలాలు, రోడ్లు, చెరువులు, నాలాలు కబ్జా చేస్తున్నారని, ఎమ్మెల్యే వారికి అండగా నిలుస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆరోపించారు. 23వ డివిజన్ పరిధిలోని నాలా కబ్జాతో దాదాపు 20 కాలనీల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినా సబితమ్మ సదరు సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపడంలేదని, కబ్జాలో ఆమె అనుచరులు ఉండడమే దీనికి కారణమని ఆయన విమర్శించారు. నాలా కబ్జాతో పాటు ఇతర సమస్యల పరిష్కారంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం బీజేపీ క్లస్టర్-12 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. పరిసర కాలనీల నాలా(డ్రైనేజీ) బాధితులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలోని ఎస్‌ఎన్‌డీపీ నాలాను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్తామని, ఎమ్మెల్యే ఎప్పుడు పిలిచినా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే పార్కు స్థలాల కబ్జాపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. అనంతరం సమస్యలపై మునిసిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎన్.యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.మల్లారెడ్డి, బీజేపీ మాజీ అధ్యక్షుడు సీహెచ్ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివారెడ్డి, కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ టి.శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అనితాప్రభాకర్, రమాదేవి శ్రీనివాస్, శంకర్, లక్ష్మారెడ్డి, ఇంద్రసేన, సునీతాశ్రీకాంత్‌గౌడ్, నాయకులు ఎ.రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మల్లేశ్, ఎన్.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిర పరమేశ్వరి ఆలయ బ్రహ్మోత్సవాలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాలపీఠం శ్రీ ప్రత్యంగిర పరమేశ్వరి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు విశేష పసుపు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. జంటనగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన బుధవారం ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 6గంటలకు పల్లకి సేవ జరుగుతుందని తెలిపారు. ఈ ఉత్సవాలలో ప్రతినిధులు విఠల్‌శర్మ, నిఖిల్, సువర్ణలత, అరుణ, హేమ, రాధ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రవిగుప్తా

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఎల్‌బీనగర్ అధ్యక్షునిగా కొత్త రవిగుప్తా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రవిగుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అనుబంధంగా పని చేస్తుందన్నారు. ఆర్యవైశ్యులలో ఉన్నత చదువులు చదువుకునే స్తోమత లేని వారికి తనవంతు సహాయసహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగభూషణంగుప్తా, గౌరవ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్‌గుప్తా, కోశాధికారి నగేష్‌గుప్తా, రాజుగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు

వనస్థలిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్ర జ్యోతి): భూగర్భ డ్రైనేజీ ద్వారా మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మ్యాన్‌హోల్స్‌లో నిండిపోయిన వ్యర్థాలను సిబ్బంది తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

'డిపాజిట్లు సేకరించి పరారైన వారిపై చర్యలు తీసుకోవాలి'

వనస్థలిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్ర జ్యోతి): ప్రజలను నమ్మించి, డిపాజిట్లు సేకరించి పరారైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కాలనీవాసులు డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ సుభద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. వనస్థలిపురానికి చెందిన కర్నికొండ నరేష్, నరేందర్, కొత్తకోట సరళ టైలరింగ్ చేస్తారు. వీరు ముగ్గురు కలిసి అతి తక్కువ కాలంలో అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో 2023లో వనస్థలిపురంలోని గురుద్వార్ రోడ్డులో, కాంప్లెక్స్‌లో త్రిశక్తి ఎంటర్ ప్రైజెస్ పేరుతో సంస్థను స్థాపించారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులో తెలిసిన వారిని అధిక మొత్తంలో వడ్డీ ఇస్తామని నమ్మించి సుమారు రూ.2 కోట్లు వరకు డబ్బులు డిపాజిట్ చెయించుకున్నారు. కొంత కాలం వడ్డీలు చెల్లించారు. ఈ క్రమంలో సరళ, నరేందర్, నరేష్‌లు కాలనీవాసులకు అసలు, వడ్డీ ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. సదరు వ్యక్తులపై బాధితులు గత నవంబర్ నెలలో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చెశారు. ఇదే విషయంపై వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్‌ను వివరణ కోరగ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై గత నవంబర్‌లోనే కేసు నమోదు చేశామన్నారు. చార్జ్ షీట్ రెడీచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో త్రిశక్తి ఎంటర్ ప్రైజెస్ బాధితులు పి.సీతారామిరెడ్డి, దయాకర్, భాస్కర్, పి.గురునాథ్, పి.పరుశరామ్ తదతరులు పాల్గొన్నారు.

పరువుకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో ప్రచారం

● డీసీపీకి ఫిర్యాదు చేసిన దేవిరెడ్డి సతీష్‌రెడ్డి

కొత్తపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తనపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, విదేశాలకు పారిపోలేదని రాజ్‌గోపాల్‌రెడ్డి పీఏ దేవిరెడ్డి సతీష్ అన్నారు. తనపై తన కుటుంబంపై సోషల్ మీడియా వేదికల ద్వారా విషప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాను 16 ఏళ్లుగా పనిచేస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పరువునష్టం దావా కూడా వేశానని తెలిపారు. సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌ను కలిసి పిర్యాదు చేశారు. ఏదైనా సమాచారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసి, పరువుకు భంగం కలిగించిన సోషల్ మీడియా వేదికలపై చర్యలు తసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సైరన్, బ్లాక్ ఫిలింలపై స్పెషల్‌డ్రైవ్

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ప్రోటోకాల్ సైరన్లను బిగించడంతో పాటు బ్లాక్ ఫిల్మ్‌లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సౌత్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ-3 ఆర్.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. తాము నిర్వహించే తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మంగళవారం సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహానాయక్‌తో కలిసి సాయిబాబా టెంపుల్, డీఎంఆర్‌ఎల్ చౌరస్తాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో అక్రమంగా బిగించుకున్న 1 కార్ సైరన్లను తొలగించగా మరో 5 కార్ల అద్దాల బ్లాక్ ఫిల్మ్‌లను బిగించి, చాలానా విధించారు.

'ఎస్సీ, ఎస్టీలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు'

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వేగవంతమైన నిష్పాక్షిక దర్యాప్తు జరిపి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామని సీపీ సుధీర్ బాబు తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని చంపిన కేసులో, పోలీసుల దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ సమర్పించడంతో 14 మంది నిందితులకు కోర్టు జీవిత ఖైదు విధించిందని తెలిపారు. పాత కక్షలను మనసులో పెట్టుకొని లింగయ్య అనే వ్యక్తిపై బాధితుడి కుటుంబ సభ్యులు మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ లింగయ్య మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేయగా న్యాయస్థానం జీవితఖైదు విధించిందని సీపీ తెలిపారు.

కులగణన రీ సర్వేలో పాల్గొనండి



ఆర్‌కేపురంలో పర్యటించిన బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కులగణన రీ సర్వేలో పాల్గొని కులాల అస్తిత్వాన్ని కాపాడాలని బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని పలు కాలనీలలో ఆయన పర్యటించి కులగణనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలలో కులగణనలో పాల్గొనని వారిని కలిసి వివరాలు తీసుకునేందుకు ప్రభుత్వం రీ సర్వే చేయాలని నిర్ణయించిందని వివరించారు. కులగణన రీ సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తాము పర్యటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, గట్ల రవీంద్ర, తల్లాటి రమేష్ నేత, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు శివ, ధన్‌రాజ్‌గౌడ్, నరసయ్య, జగన్నాథం, చంద్రమౌళి, దుర్గాప్రసాద్, ఆనంద్‌కుమార్, ఏవీరావు, ఇమ్రాన్, శ్రీశైలం, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమేష్, ముజాహిద్దీన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పంటల యాంత్రీకరణపై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవన్‌లో మంగళవారం వివిధ పంటలలో యాంత్రీకరణ అనే అంశంపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. యంత్రాల సహాయంతో వరినాటు, వరికోత, ట్రాక్టర్ ద్వారా విత్తనం నాటడం, పంటలపై మందుల పిచికారి చేయడం గురించి రైతులకు వివరించినట్లు మండల వ్యవసాయ అధికారి పల్లవి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బ్రిలియంట్‌లో పీఎం ఇంటర్న్‌షిప్‌పై సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో మంగళవారం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్‌పై ఒక రోజు అవగాహన, మార్గదర్శక శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఎం ఇంటర్న్‌షిప్ ప్రాంతీయ నోడల్ అధికారి శ్రీకర్ అనుముల హాజరై మాట్లాడారు. సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఐదేళ్లలో కోటి మంది యువతకు 500 అగ్రశేణి కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. సింగరేణి కాలరీస్, మహీంద్రగ్రూప్, కేఎన్‌ఆర్, కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు హాజరై పీఎంఐఎస్ ద్వారా అందిస్తున్న ఇంటర్న్‌షిప్ అవకాశాలపై వివరించారు. 300 మంది విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నారు.

'క్యాట్'లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సాధనతోనే మెరుగైన ఫలితాలు సాధిస్తారని పాణినీయ మహా విద్యాలయ ప్రిన్సిపాల్ ఉషారాణి సూచించారు. క్యాట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాణినీయ మహావిద్యాలయ విద్యార్థులను మంగళవారం శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సతీష్ అభినందించి, సర్టిఫికెట్స్ అందజేశారు. క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 73 మంది విద్యార్థులు పాల్గొనగా..11 మంది విద్యార్థులు ప్రైజ్ మనీ, 38 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్, 24 మంది విద్యార్థులు సర్టిఫికెట్స్ సాధించారు. కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ రవికుమార్, డీన్ నాగేశ్వరరావు, సీ బ్యాచ్ ఇంచార్జ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ పనులు ప్రారంభం



పార్కు సుందరీకరణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలో రూ.38లక్షలతో చేపడుతున్న పార్కు సుందరీకరణ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చెపట్టాలని సంబంధిత అధికారులకు వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. వనస్థలిపురంలోని బీఎస్కే గ్రౌండ్‌లో పార్కు సుందరీకరణ పనులను కార్పొరేటర్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జగదీశ్ గుప్తా, కుంచ సాయికిరణ్ గౌడ్, వీరప్ప, రాంరెడ్డి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

రాయదుర్గం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా శంకర్‌కొండ తండా గ్రామం వెలిదండ మండలంకు చెందిన నేనావత్ ధర్మ(26) ఎల్బీనగర్‌లో నివాసం ఉంటూ క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం నానక్‌రాంగూడలోని మీనాక్షి టవర్ వద్ద నిలిపివున్న కారులో స్టీరింగ్‌పై తలవాల్చి ఉండటంతో స్థానికులు గమనించి రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ధర్మను కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.